క్లుప్తంగా

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని వెదిర బస్టాండ్ వద్ద గురువారం దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్‌చైర్మన్ వెన్న రాజమల్లయ్య మాట్లాడుతూ.. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు మరిచిపోలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తొరికొండ నారాయణ, నాయకులు నాగుల రాజశేఖర్ గౌడ్, మీసాల శంకరయ్య, ఎడవెల్లి రాజిరెడ్డి, పోడేటి శేఖర్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారినపడి జీవితం నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్సై తాండ్ర నరేశ్

గన్నేరువరం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై తాండ్ర నరేశ్ అన్నారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి విక్రయించినా, వినియోగించినా నేరమని, యువత, విద్యార్థులు వీటి బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తెలిపారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై అప్రమత్తంగా ఉంటూ నిర్మూలనకు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఇరుముడులతో శబరిమలకు



శంకరపట్నం: వంకాయగూడెం అయ్యప్పస్వామి దీక్షాపరులు గురువారం శబరిమలకు బయలుదేరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దీక్షాపరులు వంకాయగూడెం అయ్యప్పస్వామి క్షేత్రం నుంచి ఇరుముడులతో శబరిమలకు వెళ్లారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మానకొండూర్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు డి.రిషిక వి.వర్షిణి ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 1, 2వ తేదీల్లో రాష్ట్రస్థాయి సీఎం కప్ పారా క్రీడలు నిర్వహించగా రిషిక డిస్కస్ త్రో బాల్‌లో రెండో, షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచి మెడల్స్ సాధించిందని, వర్షిణి 100 మీటర్స్ రన్నింగ్‌లో రాణించిందన్నారు. మండల విద్యాధికారి మధుసూదనాచారి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రక్తం కక్కుకొని మృతి

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎర్ర రమేశ్(51) రక్తం కక్కుకొని గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. స్నేహితులతో కలిసి రమేశ్ హుజూరాబాద్ పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్ వద్ద టీ తాగేందుకు వెళ్లాడు. టీ తాగిన కొద్ది సేపటికి రక్తం కక్కుకొని కిందపడిపోగా 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేశ్ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

ఇలాగైతే నీరు పారేదెలా..?

- అధ్వానంగా డీబీఎం–17 ఉపకాలువ
- చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమే



పెద్దపాపయ్యపల్లి గ్రామం మీదుగా వెళ్లే ఉపకాలువలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

హుజూరాబాద్: యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందేలా లేదు. కాలువలపై ఆధారపడి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు కాలువల పరిస్థితిని చూస్తే మాత్రం సాగు పనులు చేద్దామంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీబీఎం–17 ఉపకాలువ అధ్వానంగా తయారైంది. పిచ్చి మొక్కలు, పలుచోట్ల ధ్వంసంకావడంతో కాలువ పూర్తిగా రూపురేఖలు కోల్పోతోంది.

కాలువపై అలసత్వం..

ఎస్సారెస్పీ కెనాల్ కింద డీబీఎం–17ఉపకాలువ పరిధిలో పెద్ద పాపయ్యపల్లి, హుజూరాబాద్, రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో సుమారు 250 ఎకరాలకు నీరు అందుతోంది. పెద్దపాపయ్యపల్లి నుంచి హుజూరాబాద్ పోచమ్మ గుండ్ల కింది వరకు వెళ్లి వాగులో కలుస్తుంది. ఉపకాలువ కింద ఆయకట్టు రైతులు ఏడాదికి రెండు పంటలు పండిస్తారు. ప్రధాన ఆధారమైన కాలువపై అధికారుల పట్టింపు కరువైంది. నీరు వెళ్లకుండా తుంగ, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగడంతోపాటు పూడిక పేరుకుపోడంతో కాలువ చివర భూములకు నీరు అందకుండా పోతోంది. పొలాలకు సక్రమంగా నీరందకపోవడంతో బీళ్లుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సాగును దృష్టిలో పెట్టుకొని కాలువకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



డీబీఎం–17 ఉపకాలువకు మరమ్మతులు చేపట్టాలి. కాలువలో పూడిక, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలి. కాలువ సరిగ్గా లేకపోతే చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి లేదు. అధికారులు చర్యలు చేపట్టి కాలువకు పూర్వ వైభవం తీసుకరావాలి.
– పసుల స్వామి, సామాజికకార్యకర్త, హుజూరాబాద్

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం



యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. కాకతీయ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి



చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో అనుమాసుల మల్లారెడ్డి ఇంటి ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగాపోతోంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని, రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద లీకేజీపై స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి లీకేజీకి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఖాజామొయినొద్దీన్, మండల పరిషత్ సూరింటెండెంట్, చిగురుమామిడి, 9440490768

జమ్మికుంట పట్టణ అభివృద్ధే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ అయాజ్, కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. గురువారం రూ.50 లక్షల నిధులతో పట్టణంలోని వైకుంఠధామం అభివృద్ధి పనులను ప్రారంభించారు. మున్సిపల్‌లోని 30 వార్డుల్లో కౌన్సిలర్ల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనాథ శవాలు, సొంత ఇల్లు లేని నిరుపేదలు కర్మకాండతోపాటు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో కొనసాగిన శ్మశాన వాటికను ఇటీవల మున్సిపల్‌కు అప్పగించారని, నిర్వహణ చేసిన డాక్టర్ రాజేశ్వరయ్య, చందా విశ్వనాథంను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, కౌన్సిలర్లు బోగం సుగుణ, దయ్యాల శ్రీనివాస్, గాజుల భాస్కర్, దిడ్డి రాము, నాయకుడు బచ్చు శివశంకర్ పాల్గొన్నారు.

రైతులు అభ్యంతరాలు తెలియజేయాలి



బొమ్మనపల్లిలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్, తదితరులు

చిగురుమామిడి: మండలకేంద్రంతోపాటు బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, సుందరగిరి గ్రామాల్లో గౌరవెల్లి సాగునీటి కెనాల్ తవ్వకాల్లో కోల్పోతున్న భూములు, ఇతర ఆస్తులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ గురువారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కెనాల్ తవ్వకాల్లో తొలగించే మామిడి, బత్తాయి, టేకు, ఇతరత్రా చెట్లు, పైపులైన్స్, పశువుల పాకలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. రైతులు అభ్యంతరాలుంటే తెలియజేయాలని, గతంలో చేసిన సర్వేలో గుర్తించని వాటిని లెక్కించనున్నామని పేర్కొన్నారు. వెంట ఆర్ఐ అరుణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



యువజన కాంగ్రెస్ నాయకులతో కాజీపేట శ్రీనివాస్

హుజూరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఎన్నికల్లో గెలుపొందిన పలువురు నాయకులకు పట్టణంలోని తాజ్ హోటల్లో పార్టీ నాయకుడు కాజీపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితె ప్రణవ్ నేతృత్వంలో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి అవగాహన కల్పించాలన్నారు. సన్మానం పొందిన వారిలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు, కార్యదర్శి ఎండీ. సజ్జు, హుజూరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు ఆడెపు శ్రీకాంత్, బొరగాల సంపత్, కందుల సందీప్, చింతల నరేశ్, చిట్యాల రేవంత్, ఎండీ. సల్మాన్, హుజూరాబాద్ మండల ఉపాధ్యక్షుడు రేణికుంట్ల సందీప్, ప్రధాన కార్యదర్శులు అజయ్, ఎస్కే. సమీ, కమలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి గాలీబ్ నవీన్, కార్యదర్శి ఆసిఫ్, జమ్మికుంట మండల ఉపాధ్యక్షుడు అకినపల్లి శ్యామ్ ఉన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి సదానందం, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాలీక్ హుస్సేన్, నాయకులు సంగెం శ్రీనివాస్, కొలిపాక రమేష్, నరేష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

చొప్పదండి: పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.36.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచనల మేరకు కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని, త్వరలో పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

జమ్మికుంట: రాష్ట్రంలోని సాంఘిక, సంక్షేమ, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఎన్‌టీఎస్ఎఫ్ (నవ తెలంగాణ విద్యార్థి ఫెడరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో విఫలమైందని, విద్యారంగ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. లేదంటే విద్యార్థులతో ఆందోళనలు చేపడతామన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

తిమ్మాపూర్: రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేసింది. ఈ మేరకు హాస్పిటల్ నిర్మాణానికి ఈఎస్ఐ అధికారుల బృందం, రెవెన్యూ సిబ్బంది ఎల్ఎండీ కాలనీలో గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు వైద్యం అందించేందుకు ఆస్పత్రి నిర్మాణానికి చొప్పదండి, కొత్తపల్లి, ఎల్ఎండీ కాలనీ ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. ఎల్ఎండీ కాలనీ పరిసర ప్రాంతంలో క్వార్టర్స్ ప్రాంతాలను పరిశీలించారు. మసీదు నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు ఈఎస్ఐ టీం సర్వే చేపట్టింది. అనంతరం కరీంనగర్ పట్టణంలోని సీఎస్సై చర్చి ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని కూడా పరిశీలించనున్నామని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రైవేటు ఆసపత్రిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, తదితరులు

జమ్మికుంట: ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్యం అందించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లోని వార్డులు, ఫార్మసీ, వైద్య సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. వైద్యం, రోగులకు సేవలు అందించడంతో పొరపాట్లు, ఇబ్బందులు కలగొద్దని సూచించారు. అనంతరం ధర్మారం పల్లె దవాఖానలో వంద రోజుల టీబీ నిక్షయ్ శిబిర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ విజయ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాంనాయక్, జిల్లా, మండల హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ అరుణ, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, ల్యాబ్ సూపర్‌వైజర్ చదువు కిరణ్, ఏఎన్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, నాయకులు

హుజూరాబాద్: రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యాసంగి సాగు ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతుభరోసా అందించకపోవడం విచారకరమని, ఎన్నికల హామీలు అమలు చేయాలన్నారు. ఆరు గ్యారంటీల్లో ఒకటి రెండు పథకాలు తప్పా మిగతావి అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెల్మరెడ్డి రాజిరెడ్డి, మండల కార్యదర్శి కొప్పుల శంకర్, సైదాపూర్ మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్ పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులు

క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మికుంట: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జమ్మికుంట ఎస్‌టీవోశాఖ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌ను సూపరింటెండెంట్ కూతాడి ప్రభాకర్ పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్, రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అములు చేయాలన్నారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, 2023 జూలై నుంచి పీఆర్‌సీ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నాగభూషణం, జమ్మికుంట అధ్యక్షుడు చంద్రయ్య, వీరస్వామి, మొగిలయ్య, ఐలయ్య, సుధాకర్, ఎండీ హసన్, దేవాదాసు, ఖాజా మొయినొద్దీన్, బొల్లి సమ్మయ్య, విజయలక్ష్మి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా మల్లన్న పట్నాలు



బొమ్మకల్‌లో పట్నం వేస్తున్న పూజారులు



పట్నం వేసి ఒగ్గుకథ చెబుతున్న పూజారులు

కరీంనగర్‌రూరల్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మల్లన్న దేవుడి పట్నాలు గ్రామాల్లో వైభవంగా సాగుతున్నాయి. ప్రతీ ఆది, బుధవారాల్లో పట్నాలతో ఇండ్లు సందడిగా మారుతున్నాయి. ఏటా డిసెంబర్ మొదటి వారంలో సుబ్రహ్మణ్యషష్టివారాలు (మహాదండి)తో ప్రారంభమై సంక్రాంతి పండుగ వరకు కొనసాగుతాయి. శివరాత్రి వరకు సైతం పట్నాలు వేసుకునే అవకాశం ఉంది. ఏదేళ్లకోసారి పట్నాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నగునూరు, జగ్గయ్యపల్లె, దుర్శేడ్, చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, రుక్మాపూర్, చాకుంట, చొప్పదండి తదితర గ్రామాల్లోని ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో పెద్దపట్నం, గద్దె పట్నం వేసి మల్లన్న దేవుడిని కొలుస్తారు. మల్లన్న పట్నాలు వేసే భక్తులు ముందుగా పోచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మల్లన్న పట్నాల్లో భాగంగా మొదటిరోజు ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో గ్రామ శివారులో నుంచి పుట్ట బంగారం(పుట్టమన్ను) తీసుకొచ్చి గద్దెను నిర్మిస్తారు. రెండోరోజు ఐదు రంగులతో లగ్న పట్నం వేసి మల్లన్న దేవుడితో గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మతో వివాహం జరిపిస్తారు. మూడో రోజు కుటుంబీకులతో జోగు(భిక్షాటన) చేసి బియ్యం సేకరిస్తారు. నాల్గో రోజు నాగవెల్లి పట్నం వేసి ఒగ్గుపూజారులు మల్లన్న ఒగ్గుకథ చెప్తారు. కుటుంబీకులు, బంధువులకు పూజారులు ఆకుల్లో పాలు పోసి శంకు తీర్థం పెట్టడంతో పట్నాలు ముగుస్తాయి.

లారీని ఢీకొన్న పాలవ్యాన్



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో గురువారం ఆగిఉన్న లారీని పాలవ్యాన్ ఢీకొంది. హుజూరాబాద్ నుంచి పాలప్యాకెట్ల లోడుతో పెద్దపల్లికి బయలుదేరిన వ్యాన్ మార్గమధ్యలో లారీని వెనుక నుంచి ఢీట్టగా వ్యాన్ ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కేశవపట్నం పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. పాలప్యాకెట్లను మరో వ్యాన్‌లోకి మార్చి పెద్దపల్లికి తరలించారు.

అదృశ్యం కేసు

జమ్మికుంట: ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యం కేసు గురువారం నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పట్టణానికి చెందిన యువతి బుధవారం రాత్రి నుంచి కనపించకపోవడంతో తల్లిదండ్రులు బంధువులను సంప్రదించారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

వన్నారం మాజీ సర్పంచ్ మృతి

మానకొండూర్: మండలంలోని వన్నారం మాజీ సర్పంచ్ పొలాడి రామారావు(87) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, జీవీరామకృష్ణారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారదాసు లక్ష్మణ్ రావు, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ అంత్యక్రియలో పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముస్కాపురి స్వప్న (36) భర్త దెబ్బలకు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు... ముస్కాపురి సంపత్ కు స్వప్న మొదటి భార్య వీరికి ఒక కొడుకు ఉన్నాడు. కొడుకు సాయిచంద్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. స్వప్న ఉండగానే సంపత్ పదేళ్ల క్రితం మరో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. ఈ క్రమంలో స్వప్న, సంపత్‌కు తరుచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి స్వప్న ఉండే ఇంటి తలుపులను పగులగొట్టి తీవ్రంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక స్వప్న గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో దూకేందుకు యత్నించగా పలువురు ఆమెను నిలువరించారు. ఈ క్రమంలో స్వప్న స్పృహకోల్పోగా చిగురుమామిడి ఎస్సై బి రాజేశ్‌కు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకొని జరిగిన సంఘనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం సంపత్ పరారీలో ఉన్నాడని గ్రామస్తులు తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీపై ఆరా

శంకరపట్నం: మండలంలో రేషన్ బియ్యం పంపిణీపై పౌరసరాఫరాలశాఖ అధికారులు ఆరా తీశారు. ఓ రేషన్ దుకాణంలో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయలేదన్న ఆరోపణలు రావడంతో సంబంధితశాఖ కమిషనర్ కార్యాలయం అధికారులు రేషన్‌దుకాణంలో గతనెల బియ్యం నిల్వలు, ఇతర వివరాలను సేకరించినట్లు తెలిసింది.